క్లుప్తంగా

వేడుకగా మహాలక్ష్మి శోభాయాత్ర



మహాలక్ష్మి అమ్మవారు

కొయ్యలగూడెం: దీపావళి వేడుకను పురస్కరించుకుని టెంపుల్స్ సెంటర్‌లోని త్రిశక్తి పీఠంలో కొలువైన ఈ మహాలక్ష్మి అమ్మవారికి సొభాయాత్ర పూజా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అదేవిధంగా శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో సామూహిక పూజలు నిర్వహించారు.

అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి



అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

జంగారెడ్డిగూడెం: అమరవీరుల ఆశయ సాధనకు పోరాటాలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డు విక్రమ్ భవన్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద జెండాను కేవీ రమణ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజం కోసం భారత విప్లవోద్యమంలో పని చేసి ఎందరో అమరులయ్యారన్నారు. వారి ఆశయ సాధనం కోసం ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో మల్లేటి శ్రీను, తమ్మాసోమలింగ మల్లికార్జునరావు, కె.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలెంలో డాక్టర్ తెల్లం గంగాధరరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరంలో 153 మందికి అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, చంటిబాబు, కరీముల్లా, ఆమేన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇవాంజలిన్ అశోక్, పాడియం సూర్యచంద్రరావు, టీచర్ టి.గంగాధర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 29, 30 తేదీల్లో కైకరం, బ్రాహ్మణగూడెంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌ను నిర్వహించారు. అందులో అండర్-14 బాలుర విభాగంలో కోకో పోటీల్లో ఐ.మాధవ్, అండర్-17 బాలికల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పి.పూర్ణిమ గెలుపొంది, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వెలవెలబోయిన బాణసంచా దుకాణాలు

కొయ్యలగూడెం: దీపావళి వేడుక చేసుకునేందుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో బాణసంచా దుకాణాలు వేలవెలబోయాయి. దీపావళి వేడుక రెండు రోజుల ముందుగానే ప్రారంభమయ్యే విధంగా సంకేతాలను ఇస్తూ మందు గుండు సామగ్రిని కాలుస్తూ సంబరాలు చేసుకునే ప్రజలు ఈ సంవత్సరం అందుకు దూరంగా ఉండిపోయారని వ్యాపార వర్గాలు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం వరకు సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం ఈ కొనుగోలు 50 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా 16 షాపులకు లైసెన్సులు ఇచ్చారు. సగానికి పైగా కూటమి వ్యాపారస్తులు దక్కించుకున్నారు.

పేదలకు బాణసంచా పంపిణీ



బాణసంచా పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దీపావళి పండుగను పురస్కరించుకుని శుక్రవారం గవరవరంలోని మేదర పేటలో పేదలకు బాణసంచా ఉచిత పంపిణీ నిర్వహించారు. బాలగణపతి దేవాలయం ఆవరణలో శ్రీలక్ష్మి గణపతి మేదర (మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో 100 కుటుంబాల వారికి రూ.50 వేల విలువైన మందుగుండు సామగ్రిని చిన్నారులకు, మహిళలకు అందించారు. సాంప్రదాయ వేడుకలను భావితరాలకు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్తీకం.. బౌద్ధారామాలు సిద్ధం

- కార్తీక మాసం సందర్భంగా ప్రారంభం కానున్న సందడి
- ఇక్కడ ప్రాణాచారం పడితే సంతాన ప్రాప్తి



సంతాన ప్రాప్తికి ప్రాణాచారం పడిన మహిళలు (ఫైల్)



ధర్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఫైల్)

కామవరపుకోట: మండలంలోని జీలకరగ్రూడెం గ్రామ పంచాయతీ గుంటుపల్లిలోని బౌద్ధారామాలు కార్తీక మాసంలో భక్తులతో, పర్యాటకులతో సందడిగా మారి కార్తీక మాసం శోభను సంతరించుకుంటాయి. ఈ బౌద్ధారామాల వద్ద ఉన్న భారీ లింగాకారాన్ని ప్రజలు ధర్మ లింగేశ్వరస్వామిగా కొలుస్తారు. జగద్గురు ఆది శంకరాచార్యులు దేశ పర్యటనలో భాగంగా బౌద్ధారామంలోని ప్రధాన స్థూప చైతన్యాన్ని ధర్మ లింగేశ్వర స్వామిగా రూపాంతరం చేసి, పూజలు చేశారని బౌద్ధులు చెబుతుంటారు. ప్రతి ఏటా కార్తీకమాసంలో తిరునాళ్ల నిర్వహిస్తారు. గట్టు తీర్థంగా ప్రసిద్ధి చెందిన ఈ తిరునాళ్లలో మూడో సోమవారం యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ తిరునాళ్లకు భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని పాండవులు తిరిగిన ప్రదేశంగా స్థానికులు చెబుతుంటారు. దీనిలో భాగంగానే ఇక్కడ రాతిపై భీముని పాదం ఉన్నట్లుగా ప్రజలు భావించి పూజలు నిర్వహిస్తారు. ఇక్కడున్న ధర్మ లింగేశ్వర స్వామికి ప్రాణాచారం పడితే సంతానం కలుగుతుందని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ప్రాణాచారం అంటే సంతానం కోసం మొక్కుకున్న మహిళలు ధర్మ లింగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బోర్లంగా పడుకుని తనను తాను మరిచిపోయి దైవత్వంలోకి మునిగిపోతూ నిద్రావస్థలోకి చేరుకోవడాన్ని ప్రాణాచారం అంటారు. అలా ప్రాణాచారంలో ఉన్నప్పుడు దేవుడు ప్రత్యక్షమై తను కోరుకున్న కోరికలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. సంతానం లేని మహిళలు తల స్నానం చేసి పండ్లు, పూలు చేతితో పట్టుకుని ఈ బౌద్ధాలయం వద్ద ధర్మలింగేశ్వరస్వామి ఎదుట ప్రాణాచారం పడతారు. అలా ప్రాణాచారం పడిన వారికి స్వామి కలలో ప్రత్యక్షమై పండ్లు అందజేస్తే మగ బిడ్డ పుడతాడని, పూలు అందజేస్తే ఆడపిల్ల పుడుతుందని, చీపురు, చాట కనబడితే వారికి సంతాన భాగ్యం లేదనేది ఈ ప్రాంత వాసుల నమ్మకం. అలా పుట్టిన పిల్లలకు మొక్కులు తీర్చి ధర్మయ్య, లింగయ్య, ఈశ్వరయ్య, , ధర్మవతి, ధర్మలక్ష్మి ఇలా అనేక పేర్లు పెడుతుంటారు. తిరునాళ్ల సందర్భంగా మండలంలో మూడో సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తారు. అలాగే ఈ ప్రాంతంలో అడపాదడపా సినిమా షూటింగ్‌లు సైతం నిర్వహిస్తుంటారు. ఈ ప్రదేశానికి వచ్చే భక్తులకు, పర్యాటకులకు ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. నిధులు కేటాయించి ఈ ప్రదేశాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరచాలని పలువురు కోరుతున్నారు.

నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి



చారిత్రక ఆనవాళ్లు కలిగిన ఈ ప్రదేశానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి నిత్యం పర్యాటకులు వస్తూ ఉంటారు. కార్తీక మాసం వచ్చిందంటే భక్తులతో, పిక్నిక్‌కి వచ్చిన వారితో ఈ ప్రదేశం కిటకిటలాడుతుంది. కానీ ఇక్కడకు వచ్చే వారికి సరైన మౌలిక వసతులు లేవు. ఈ ప్రదేశాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పరిచే విధంగా చొరవ తీసుకోవాలి.

– కంభం విజయ రాజు, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్

సంతానం కలుగుతుందని నమ్మకం



కార్తీకమాసంలో ధర్మలింగేశ్వరస్వామి ఆలయం ఎదుట ప్రాణాచారం పడటం అనేది అనాదిగా వస్తున్న సాంప్రదాయం. సంతానం లేని మహిళలు జిల్లా నలుమూలల నుంచి వచ్చి ఇక్కడ ప్రాణాచారం పడతారు. ఈ సందర్భంగా వచ్చిన కలలు నిజమని భక్తులు దృఢంగా నమ్ముతారు. ఈ ప్రాంతంలో అనేక మందికి సంతానం కలిగిందనేది వాస్తవం.

– వీరమల్ల మధు, కామవరపుకోట

ఏజెన్సీలో ఘనంగా దీపావళి వేడుకలు



దీపావళి జరుపుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: దీపావళి పండుగను ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళ ఇళ్లల్లో దీపాలు వెలిగించుకుని లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చి ఆనందంగా గడిపారు. మండలంలోని దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ జరుపుకున్నారు.

నేడు నిధుల పంపిణీపై విచారణ

కొయ్యలగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజా పరిషత్ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. మండల పరిషత్ నిధుల పంపిణీ, తీర్మానాల వ్యవహారం వివాదాస్పదమైన నేపథ్యంలో పరిషత్ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దీంతో ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవోను పలు అంశాలపై వివరణ కోరామన్నారు. శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నిధుల పంపిణీ వివరాలు, తీర్మానాలను తెలుసుకోవాల్సిన సభ్యులు సమావేశానికి హాజరు కావాల్సిందిగా సూచించారు.

నేడు లక్ష దీపోత్సవం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న శ్రీకృష్ణ పురంధరదాసు మండలి సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఈ నెల 2వ తేదీ శనివారం లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ పురంధరదాసు మండలి సభ్యులు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని రావులమ్మ చెలక, సూర్య కిరణ్ ఫంక్షన్ హాల్ సమీపంలో శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను మండలి సభ్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం అలివేలు మంగా, బీబీ నాంచారి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య మూర్తులకు శ్రీ పుష్పయాగం, లక్ష కుంకుమార్చన వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, పవిత్ర కార్తీక మాసంలో దీప ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు కోలాట సంఘాల ప్రతినిధులు టీటీడీ ధర్మ ప్రచార మండలిసభ్యులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

లింగపాలెం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ లింగపాలెం మండలంలో వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఏరువాక కేంద్రం, ఏలూరు వారు నిర్వహిస్తున్న ఎంటీయూ 1310 ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా రైతులు సొంతంగా విత్తనాన్ని తయారు చేసుకుంటే సాగులో రెండింతల లాభాలను పొందొచ్చని సూచించారు. అధిక దిగుబడులనిచ్చే నూతన వంగడాలను పండించి లాభదాయకమైన ఆదాయాన్ని అందిపుచ్చుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్, విస్తరణ శాస్త్రవేత్త ఎన్.నాగేంద్ర బాబు, ఆర్ఎస్‌కే సిబ్బంది నాని, గణేష్, రైతులు పాల్గొన్నారు.

పెద్దవాగు మరమ్మతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ఎస్‌కే గౌస్

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు మండలాల రైతులకు సాగునీరందేలా పెద్దవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల మరమ్మతులు చేపట్టాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే గౌస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వేలేరుపాడు కార్యాలయంలో తుర్రం తమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపంథా వేలేరుపాడు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ భారీ స్థాయిలో అనేక రైతాంగ పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ జీవో ఆర్‌టి నెంబర్ 65 జారీ చేసిందన్నారు. దీని వల్లనే పెద్దవాగు కాలువల మరమ్మతులకు రూ.44 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, వేలేరుపాడు పార్టీ మండల కార్యదర్శి సోయం చందర్‌రావు, పార్టీ జిల్లా నాయకులు కట్టం వీరస్వామి, డివిజన్ నాయకులు కట్టం ముత్యాలరావు, కారం సత్యవతి, మేడిపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు, ఉప సర్పంచ్ మోసం రాజారావు, ఆశి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పనిచేస్తే ప్రజాభిమానం చూరగొంటామని వైస్ ఎంపీపీ మట్టా వనజా లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో ఎస్సీ బాలికల హాస్టల్ వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వనజా లక్ష్మి ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.1.20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి నవంబర్ నెలాఖరులోగా రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఎంపీపీ గంజిమాల రామారావు, మాజీ ఎంపీపీ సత్తిపండు గ్రామ, కార్యదర్శి కంపా సురేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

టి.నరసాపురం: ఇప్పటికీ, ఎప్పటికీ విలువైన జ్ఞాపకాలను పదిలంగా అందించేది ఫొటో అని, వాటిని మనకందిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు అభినందనీయులని ఏఎస్సై వి.జయకుమార్, టి.నరసాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం లింగస్వామి అన్నారు. టి.నరసాపురంలో మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతీ క్షణాన్ని మధుర జ్ఞాపకంగా మార్చేందుకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు అభివృద్ధి చెందుతున్నారని, వృత్తిలో వారి నిబద్ధత వెలకట్టలేనిదన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రెసిడెంట్‌గా ఆర్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జి.మహారాజు, సెక్రటరీ పి.చందు, జాయింట్ సెక్రటరీ, టి.సురేష్, ట్రెజరరీ ఎం.వాసులతో ఏలూరు జిల్లా ఫోటోగ్రాఫర్స్ సెక్రటరీ వీఆర్ చిన్ని ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ద్వారకాతిరుమల, కామవరపుకోట ప్రెసిడెంట్‌లు పాల్గొన్నారు.

కార్మిక పోరాటంలో ఏఐటీయూసీ ప్రధాన పాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నేతలు



ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కార్మిక హక్కుల కోసం పోరాటం చేయడంలో ఏఐటీయూసీ ప్రధాన పాత్ర పోషిస్తుందని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెయిన్ సెంటర్‌లో ముఠా కార్మికులతో కలిసి శ్రీనివాసరావు ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, వెలగల రామారావు, మట్టా రామకృష్ణ, వెలగల నాని, అయినపర్తి మహేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక లోకం ఏకమై పోరాడాల్సిన సమయం ఆసన్నమయ్యిందని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం చింతలపూడిలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కె.అప్పారావు, ఆర్ వెంకటేశ్వర్రావు, వీరబాబు, నెల్సన్ , అమ్మ భవాని తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు: ఏఐటీయూసీ 105 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవాన్ని వేలేరుపాడు సిపిఐ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్ మాట్లాడుతూ ఈ దేశ చరిత్రలో సుదీర్ఘ చరిత్ర గలిగిన ఏకైక సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నెపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిశ రాము కౌలూరి సైదా చందా రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, మున్సిపల్ కార్యాలయం వద్ద పతాకాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, ద్వారకా తిరుమల మండల సీపీఐ కార్యదర్శి గొలిమే బాలయేసు, చందా త్రిమూర్తులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జంగారెడ్డిగూడెం కార్యదర్శి బొక్క శ్రీను, కంతేటి వెంకట్రావు, నిమ్మల సుబ్రహ్మణ్యం, ముప్పిడి శ్రీను, బూరుగు సంజీవ్, చంద్రకళ, దయామని, హనుమంతు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

జంగారెడ్డిగూడెం: భగత్‌సింగ్ ఆశయాలను సాధిస్తాం డీవైఎఫ్ఐ జంగారెడ్డిగూడెం పట్టణం తొమ్మిదో వార్డ్ అమ్మ వెల్డింగ్ షాప్ వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమానికి డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కే మాబు సుభాని అధ్యక్షత వహించగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్, మాజీ నాయకులు పసల సూర్యారావు మాట్లాడుతూ 1980లో పంజాబ్ రాష్ట్రంలోని లుథియానా నగరంలో అందరికీ విద్య-అందరికీ ఉపాధి అనే నినాదంతో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యని ఏర్పాటు చేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు సేవా కార్యక్రమాలు నిర్వహించి దేశంలోని యువత మద్దతు పొంది అతిపెద్ద యువజన సంఘం ఎదిగిందని తెలిపారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సమైక్య కార్యదర్శి వంగ గోపి, సత్యనారాయణ, కమిటీ సభ్యులు మున్సిపల్ ఆఫీసర్ కె.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కమిటీ సభ్యులు, పట్టణ పౌర సమైక్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు



కార్తీకమాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 2వ తేదీ శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అన్నారు. ఆలయంలో కార్తీక మాసోత్సవాల కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల వివరాలను సిటీకేబుల్ ఎండీ చిన్ని హరీష్, ఆధ్యాత్మిక వేత్త కేవీఎల్ఎస్ ధనకుమార్ వివరించారు. కార్తీకమాస కార్యక్రమాలు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో వచ్చే కార్తీక సోమవారాల్లో పార్థివ శివ లింగానికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అనంతరం బిల్వార్చన, నవంబర్ 5న 23వ చండీహోమం, నవంబర్ 15న పౌర్ణమి తిథిని పురస్కరించుకుని విజయదుర్గమ్మకు పల్లకీసేవ, అనంతరం జ్వాలాతోరణం, నవంబర్ 25 నాలుగో సోమవారం సాయంత్రం 6 గంటలకు శివ పార్వతులకు కల్యాణం అనంతరం లక్ష దీపోత్సవ కార్యక్రమం, నవంబర్ 29న మాస శివరాత్రి పురస్కరించుకుని శివ పార్వతులకు పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడ రామమోహనరావు, ఆలయ అభివృద్ధి కమిటీ, మహిళా కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరంగం సృష్టించిన యువకుడు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో శుక్రవారం రాత్రి యువకుడు వీరంగం సృష్టించాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో ఓ పూల దుకాణం వద్దకు యువకుడు ప్రేమించిన యువతి రావడంతో, యువకుడు ఆమెతో ఘర్షణకు దిగాడు. అక్కడే ఉన్న వారు యువకుడిని అడ్డుకోగా, ఆ యువకుడు వారిపై దాడి చేశాడు. అదే సమయానికి యువతి బంధువులు సైతం అక్కడకు రావడంతో గొడవ పెద్దదయ్యింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై జబీర్ ఘటనా స్థలికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

కార్తీకమాసం ఏర్పాట్లు ముమ్మరం

పోలవరం రూరల్: కార్తీకమాసం సందర్భంగా పోలవరం మండలం పట్టిసీమ అఖండ గోదావరి నది మధ్యగల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టిసీమ రేవు వద్దకు చేరుకుని నదిలో లాంఛీపై దాటి ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ శివక్షేత్రం చేరుకుంటారు. దేవస్థానం వద్ద దర్శనానికి వీలుగా సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌వీఎన్ కాలనీ సమీపంలో బడ్డీ కొట్టులో అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బడ్డీకొట్టు యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఆర్‌వీఎల్ నరసింహారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవరంలో పవన్ పర్యటన

కొయ్యలగూడెం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం రాజవరంలో పర్యటించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం సుందరగిరికి వెళుతూ మార్గంలో రోడ్డు అధ్వానంగా ఉండటాన్ని గమనించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరయ్యాయని తెలుపగా, రోడ్డు అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.